వెదజల్లే పద్ధతిపై రైతుల ఆసక్తి

- వరిసాగులో డ్రమ్‌సీడర్, వెదజల్లుడుకు మొగ్గు
- కూలీల కొరత, ఖర్చును అధిగమించేందుకే..

అత్మకూర్ (ఎస్) : వరిసాగులో రైతులు నూతన విధానాన్ని అవలంబిస్తున్నారు. దీంతో వరినాట్లను వదిలి వెదజల్లుడు, డ్రమ్‌సీడర్ పద్ధతులపై రైతులు అధికంగా దృష్టి సారిస్తున్నారు. కూలీల కొరత, నాట్ల ఖర్చులను తగ్గించుకోవడానికి మూడేళ్లుగా వెదజల్లుడు, డ్రమ్‌సీడర్ విధానంతో సాగు చేయడంతో పాటు చేసిన పొలాలు మంచి దిగుబడిని అందించడంతో ఇతర రైతులు ఈ వైపే అడుగులు వేస్తున్నారు. దీంతో ఈ యాసంగిలో మండల వ్యాప్తంగా రైతాంగం వెదజల్లే పద్ధతి వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం మండల వ్యాపంగా 22వేల ఎకరాల్లో వరిసాగు చేయగా దాదాపు 8వేల ఎకరాలకు పైగానే వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేపట్టినట్టు అధికారులు అంచనావేస్తున్నారు.

ఎస్సారెస్పీ జలాలతో..

మూడేళ్లుగా మండల వ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురిశాయి. దీనికి తోడుగా ఎస్సారెస్పీ జలాలు రావడంతో చెరువులు, కుంటలు నిండి పుష్కలంగా నీళ్లు లభ్యమయ్యాయి. ఈ క్రమంలో రైతులు మెట్టపంటలు సాగయ్యే భూములను పొలాలను మార్చారు. దీంతో మండలంలో గతంలో సాగు అయిన పొలాలకు రెట్టింపు విస్తీర్ణంలో ప్రస్తుతం వరి సాగయ్యే పరిస్థితి నెలకొంది. కాగా బోరుబావులు,



కందగట్లలో వర్రి విత్తనాలు వెదజల్లుతున్న రైతులు

కాలువల కింద పొలాలు ఒకేసారి నాట్లు వేసేందుకు సిద్ధం చేసుకోవడంతో కూలీల కొరత తీవ్రంగా ఉంది. కూలీలు సమయానికి రాకపోవడంతో 25రోజులకు నాటు పెట్టాల్సిన నారు కాస్త రెండునెలలకు నాటు పడిన సంఘటనలు ఉన్నాయి. సమయానికి నాటు వేయకపోవడంతో అన్నివిధాలా కష్టం చేసిన సగం పంట కూడా చేతికి రాకుండా పోతోంది. అలాగే కూలీల వస్తారని దమ్ము చేసిన పొలాలు ఆలస్యంగా రావడంతో మళ్లీ దమ్ము చేయాల్సి రావడంతో దున్నకం ఖర్చు విపరీతంగా పెరిగింది. ఖర్చులు పెరిగిపోవడం.. దిగుబడి తక్కువగా రావడంతో రైతులు డ్రమ్‌సీడర్, వెదజల్లే విధానంపై దృష్టి సారిస్తున్నారు. కూలీలతో నాటువేసిస్తే ఎకరాకు ఖర్చు ట్రాక్టర్‌కు దమ్ముచేయడానికి దాదాపు రూ.8500, విత్తనాలకు రూ.1000, నారు పెంపకానికి రూ.1000, నాటు కూలీలకు రూ.4500, ఎరువులకు రూ.2800 వచ్చేది. కానీ అదే వెదజల్లే, డ్రమ్ సీడర్‌తో నారు పెంపకానికి రూ.1000, కూలీల ఖర్చు రూ.4500 తగ్గుతుంది.



నసీంపేటలో డ్రమ్‌సీడర్‌తో వరివిత్తనాలు విత్తుతున్న రైతు

కూలీల ఖర్చు తగ్గుతుంది



వరిసాగులో కూలీలతో నాటు వేయించేందుకు ఖర్చులు ఎక్కువ అవుతుండడంతో పాటు కూలీల కొరతతో సమయానికి నాట్లు వేయలేకపోతున్నాం. దీంతో దిగుబడులు తగ్గుతున్నాయి. వెదజల్లుడు, డ్రమ్‌సీడర్ విధానంతో సమయం ఆదాకావడంతో పాటు ఖర్చులు తగ్గుతున్నాయి. మూడు సంవత్సరాలుగా డ్రమ్‌సీడర్ విధానాన్ని అవలంబిస్తున్నాం. కూలీల కొరతతో గతంలో సమయానికి నాట్లు వేసేవాళ్లం కాదు. ఇప్పుడు సమయానికి సాగుచేయడంతో దిగుబడులు పెరిగాయి.

- మూల లింగయ్య, నసీంపేట

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తిరుమలగిరి (తుంగతుర్తి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో గుండెపురి గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మునిపంపుల భద్రయ్య, యువజన నాయకులు నల్లతీగల వేణు తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సందీప్, యాకూబ్ నాయక్, రాములు, బాబు, నరేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు అందజేత

మున్సిపాలిటీ పరిధిలోని క్రికెట్ క్రీడాకారులకు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సోమవారం స్థానికంగా క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, బీఆర్ఎస్ నాయకులు యాకూబ్‌నాయక్, సురేష్, నాని, చారి, బాబు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల నాయకులు మాదగాని వెంకన్న, తాడూరి భద్రయ్యతో పాటు పలువురు నాయకులు సోమవారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో ఆయన క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కుంభం నాగరాజు, పున్న హరిప్రసాద్, మల్లయ్య, సోమిరెడ్డి, పెద్ది శ్రీను, రాములు, మహేష్, సందీప్, ఎల్లేష్ పాల్గొన్నారు.

సంతాప సభను జయప్రదం చేయాలి

అర్వపల్లి : శాలిగౌరారం మండలం గురజాలలో నేడు జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు పనికెర లింగయ్య సంతాప సభను జయప్రదం చేయాలని ఎంసీపీఐయూ డివిజన్ ఇన్‌చార్జ్ ఈదురు వీరపాపయ్య సోమవారం కోరారు. ఈ సభకు ఎంసీపీఐయూ కేంద్ర కమిటీ సభ్యుడు వరికుప్పల వెంకన్న, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల కార్యదర్శులు నజీర్, మట్టయ్య హాజరవుతారని తెలిపారు.

మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ

పెన్‌పహాడ్ : మండలంలోని పొట్లపహాడ్ గ్రామానికి చెందిన ఉద్యమకారుడు బందు సైదులు గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. దీంతో విషయం తెలుసుకున్న మంత్రి జగదీశ్‌రెడ్డి సైదులు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అంతకు ముందు అనంతారం గ్రామంలో ఇటీవల సాగర్ ఎడమ కాల్వలో పడి మృతి చెందిన మామిడి కళ్యాణ్‌చక్రవర్తి, అనారోగ్యంతో మృతి చెందిన బైరెడ్డి మట్టారెడ్డి, గార్లపాటి వెంకట్‌రెడ్డి కుటుంబాలను పరామర్శించి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య, సర్పంచ్‌లు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రామినేని పుష్పావతికృష్ణయ్య, ఎంపీటీసీలు మామిడి రేవతిపరందాములు, మేకపోతుల సైదమ్మ, జెడ్పీ వైస్‌చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేంధర్, జుట్టుకొండ సత్యనారాయణ, నారాయణరెడ్డి, నాగార్జున, నాగార్జున, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : అనంతారంలో వెంకట్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

ఆత్మకూర్-ఎస్ : మండల పరిధిలోని గట్టికల్లు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మున్నూరు నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడి కుటుంబాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీ వైస్‌చైర్మన్ వెంకటనారాయణగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు తూడి నర్సింహారావు, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, నాయకులు మర్ల చంద్రారెడ్డి, ప్రసాద్, వెంకన్న, సర్పంచ్ సాలమ్మభిక్షం, శ్రీను, వెంకన్న, సైదులు తదితరులు ఉన్నారు.

వైభవంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

భానుపురి (సూర్యాపేట) : ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వాసవీ మాత అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా 108 గోత్రికలతో వాసవీమాత వ్రతంతో పాటు గణపతి హోమాన్ని చేపట్టారు. అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించి భక్తులు అమ్మవారికి వడిబియ్యం పోశారు. ఆత్మార్పణ దినోత్సవ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీరలు రవికలు, గాజులు, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు సింగిరికొండ సురేందర్, ప్రధాన కార్యదర్శి ఈగ వెంకటేశ్వర్లు, కోశాధికారి పోలా రాధాకృష్ణ, సుధాకర్ పీవీసీ అధినేతలు మీలా మహదేవ్, మీలా



భానుపురి : హోమం నిర్వహిస్తున్న భక్తులు

వాసుదేవ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు సింగిరికొండ రవీందర్, కలకోట లక్ష్మయ్య, గుండా శ్రీధర్, తోట శ్యాంప్రసాద్, దేవరశెట్టి సత్యనారాయణ, పసుపర్తి కృష్ణమూర్తి, బిక్కుమల్ల కృష్ణ, రాచకొండ శ్రీనివాస్, దేవాలయ అర్చకులు కృష్ణమూర్తి, చిలుకల శ్రీనివాసు, స్వాతి, అనిత, కమల, జ్యోతి, లక్ష్మి, ప్రేమలత, సుధా, మాధురి, ఉమారాణి, పల్లవి, నీరజ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోటలో గల శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం భక్తులు వాసవీమాత ఆత్మార్పణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు వాసవీ కన్యకాపరమేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు, హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయంలో 300మందికి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సత్య సాయికుమార్, ధర్మకర్తలు సాయికుమార్, అధ్యక్షుడు గుండా కిశోర్, సోమ రాములు, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, గుండ మురళి, ప్రభాకర్, ప్రేమ్‌చంద్, సంతోష్, సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.



నాగారం : హోమంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా మానవహారం



దురాజ్‌పల్లి : సూర్యాపేటలో మానవహారం నిర్వహిస్తున్న నాయకులు

ఆత్మకూర్-ఎస్ : దేశంలో ప్రజాస్వామిక వాదులపైన, నాస్తికులపైన, అంబేద్కరిస్టులపైన మతోన్మాదుల దాడులు పెరిగాయని, ఆ దాడులకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ సంఘటితం కావాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య అన్నారు. సోమవారం మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్‌లో దాడులకు వ్యతిరేకంగా మానవహారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలో రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను, ప్రాథమిక హక్కులను హరిస్తూ హేతువాదులు, అంబేద్కరిస్టులపై మతోన్మాదుల దాడులు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ నాయకురాలు కంచర్ల నర్సక్క, టీపీటీఎఫ్ జిల్లా నాయకులు పసునూరి వెంకన్న, శ్రవణ్‌కుమార్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : మతోన్మాద దాడులను అరికట్టాలని స్వేచ్ఛ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలేబోయిన కిరణ్ అధ్యక్షతన స్వేచ్ఛ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడారు. కోటగిరి మండల కేంద్రంలో ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడి చేసిన దుండగులను శిక్షించకుండా, అరెస్ట్ చేసిన వారికి సైతం బెయిల్ మంజూరు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాండారి డేవిడ్‌కుమార్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రేపాక లింగయ్య, సీపీఐ జిల్లా నాయకులు దంతల రాంబాబు, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, రాంచంద్రన్, సత్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు తూము ఎత్తు తగ్గించాలని కలెక్టర్‌కు వినతి

నాగారం : ఎస్సారెస్పీ కాలువ నీటితో ముంపునకు గురవుతున్న భూములను చెరువు తూము ఎత్తును తగ్గించి నీటిని బయటకు విడుదల చేయాలని కోరుతూ మండలంలోని ఈటూరు గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం గ్రీవెన్స్‌డేలో కలెక్టర్ హేమంత్‌కేశవ్ పాటిల్‌కు, మండల కేంద్రంలో తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ఎస్సారెస్పీ కాలువ తూము ఎత్తు పెంచడంతో చెరువు కింద ఉన్న 65మంది రైతులకు చెందిన సుమారు 200 ఎకరాల సాగు భూములు నీట మునిగి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమ పంట భూములను కాపాడాలని కోరారు. వారిలో తీగుళ్ల నర్సయ్య, జోగం వీరస్వామి, తీగుళ్ల రామచంద్రు, అవిలయ్య, రమేష్, గట్టయ్య, వీరయ్య అనిత ఉన్నారు.

సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు కృషిచేయాలి

తుంగతుర్తి : నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఓరుగంటి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశస్వాతంత్ర్యం కోసం ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీని స్థాపించి ఆగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడిన గొప్పవీరుడని కొనియాడారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు సూర్యప్రకాశ్, సోమన్న, సత్తయ్య, ఎస్ఎంసీ చైర్మన్ సైదులు, రేణుక, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


అర్వపల్లి : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మీనర్సయ్యయాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.విజయ, ఎంపీఓ సందీప్‌కుమార్, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు నర్సింహరాజు, ఎం.నవీన్, కుంకుడుపాల రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ రేణుక తదితరులు

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

సూర్యాపేట రూరల్ : వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజాద్ అలీ అన్నారు. సోమవారం మండలంలోని పిల్లలమర్రి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసలైన కార్యకర్తలు కాంగ్రెస్ వెంటే ఉన్నారని, ఒక్కరినీ పార్టీలోకి తీసుకొని కాంగ్రెస్ పార్టీ ఖాళీ అయిందంటూ ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పిల్లలమర్రికి కోట్ల నిధులు తెచ్చామని చెబుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి ఏమీ అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదాయం పెంచుకునేందుకే కాంగ్రెస్ పార్టీని వీడారని గతంలో టీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి నిధులు కేటాయించలేదంటూ చెప్పుతో కొట్టుకున్న స్థానిక కౌన్సిలర్ ఇప్పుడు ప్రజలకు ఏమని సమాధానం చెప్తారని ప్రశ్నించారు. దమ్ముంటే కౌన్సిలర్‌గా రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ విడాలని సవాల్ విసిరారు. రానున్న ఎన్నికల్లో దామోదర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చెరుకుపల్లి సంజీవ, చింత జానయ్య, విల్సన్, జానకిరెడ్డి, కోట్ల బుచ్చమ్మ, మాదగోని సత్యనారాయణ, నాగరాజు, మల్లికార్జున్, బుచ్చిరాములు, సైదులు, సంద సైదులు, కృష్ణయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

పెన్‌పహాడ్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చీదెళ్ల జెడ్పీహెచ్ఎస్ గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా జీజేఆర్ కప్ క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ క్రీడల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వస్త్రాం నాయక్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకట్రావుగౌడ్ పాల్గొన్నారు.

ఆత్మకూర్-ఎస్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మంత్రి జగదీశ్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో జీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న క్రీడలను మండల పరిధిలోని ఏపూరులో ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ధారాసింగ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూడి నర్సింహారావు, కార్యదర్శి బత్తుల ప్రసాద్, నాయకులు మర్ల చంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాఠశాల హెచ్‌ఎంలు ఉన్నారు.



పెన్‌పహాడ్ : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పీఏసీఎస్ చైర్మన్ సీతారాంరెడ్డి

సూర్యాపేట రూరల్ : క్రీడలతో విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా సోమవారం మండల పరిధిలోని ఎండ్లపల్లి ఉన్నత పాఠశాలలో జీజేఆర్ కప్ క్రీడ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు, సర్పంచ్ దండి సుగుణమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ సత్యమూర్తి, నాయకులు కుంట్ల సుదర్శన్‌రెడ్డి, రాంరెడ్డి, రవి, జానయ్య, సందీప్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

చివ్వెంల : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సీహెచ్.వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ పబ్బు సైదులు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిరి, గ్రామసర్పంచ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం ప్రారంభం

నాగారం : మండలంలోని ఈటూరు గ్రామంలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశు వైద్యశిబిరాన్ని సోమవారం ఎంపీపీ కూరం మణివెంకన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమ కోసం పాడి పశువుల్లో కలిగే గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్సలకు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో 71గేదెలకు గర్భకోశ వ్యాధి పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో తుంగతుర్తి సహాయ సంచాలకులు డాక్టర్ రవిప్రసాద్, మండల పశువైద్యాధికారి డాక్టర్ బత్తుల రవి, జేవీఓ నాగరాజు, గోపాలమిత్ర సోమయ్య, రైతులు కన్నెబోయిన మల్లయ్య, కడారి అంజయ్య, కొమ్ము సోమయ్య, పేరాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



నాగారం : దూడలకు నట్టల నివారణ మందులు తాపిస్తున్న ఎంపీపీ కూరం మణి

పశువులకు గర్భకోశ చికిత్సలు చేయించాలి

తుంగతుర్తి : మండల పరిధిలోని వెలుగుపల్లిలో సోమవారం పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మామిడి వెంకన్న మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కవిత, ఏడీ డాక్టర్ రవిప్రసాద్, డాక్టర్లు నరేష్, మమత, ఆసిఫా, రవి, గోపాలమిత్ర శ్రీనివాస్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం

నాగారం : అంధత్వాన్ని నివారించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఈ పథకంలో ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని స్థానిక తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజలు తమకు కేటాయించిన తేదీల్లో వచ్చి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటి వెలుగు శిబారాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కంటి వెలుగు శిబిరంలో 124మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 49 మందికి మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ హర్షవర్ధన్, ఎంపీఎస్ఓ చింతమల్ల రమేష్, అప్తోమెటిస్ట్ కె.ఉమ, వైద్యసిబ్బంది వినోద, ధనమ్మ, నాగమణి, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ కంటి వైద్యపరీక్షలు చేయించుకోవాలని స్థానిక తహసీల్దార్ రమణారెడ్డి కోరారు. సోమవారం మండలంలోని పాలకుర్తి ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మల్లెల వందన, సీహెచ్ఓ బిచ్చునాయక్, సూపర్‌వైజర్ స్వరూపకుమారి తదితరులు పాల్గొన్నారు.



నాగారంలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్

తులసీదాస్ మృతికి నివాళి

అర్వపల్లి : మండలంలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన మత్స్య కార్మికుడు గద్దగూటి తులసీదాస్ సోమవారం మృతి చెందాడు. దీంతో అతడి మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్, సర్పంచ్ దానం సుజాతయాదగిరి, గోసుల విజయ్, కాట బత్తిని లక్ష్మీనర్సు, డాక్టర్ జెత్రిపోతుల లక్ష్మణ్ గౌడ్, గద్దగూటి ముత్తయ్య, బొడ్డు బయ్యన్న, జానయ్య, వీరాంజనేయులు, వెంకటేష్, యల్లయ్య, సతీష్, శేఖర్ ఉన్నారు.

యువత స్వశక్తితో ఎదగాలి

తుంగతుర్తి : యువత స్వశక్తితో ఎదగాలని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో శ్రీదత్త ఎలక్ట్రానిక్స్ షాపును ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో రాములుగౌడ్, రమేష్, శ్రీనివాస్, సంతోష్, చెరకు పరమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి, ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేత

అర్వపల్లి : రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన మండలంలోని తిమ్మాపురంలో గల అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఈనెల 28న అత్యంత వైభవంగా నిర్వహించే రథసప్తమి వేడుకలకు హాజరు కావాలని కోరుతూ సోమవారం మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌లకు వారి క్యాంపు కార్యాలయాల్లో క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి ఆహ్వానపత్రికలను అందజేశారు. ఆయన వెంట గణపురం నరేష్, క్షేత్ర అర్చకులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను సరిచేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

మద్దిరాల : ఓటరు జాబితాల్లోని తప్పుఒప్పులను గ్రామాల వారీగా బీఎల్ఓలు సరిచేయాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఎల్ఓ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాలో పేరు గాని, ఇంటిపేరుగానీ, పుట్టిన తేదీ తప్పులు ఉంటే ఆధార్‌కార్డుల ఆధారంగా సరిచేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఎల్ఓలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండల వైద్యాధికారిగా నగేశ్



నాగారం : మండల వైద్యాధికారిగా డాక్టర్ భూక్య నగేశ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ హర్షవర్ధన్ కంటివెలుగు కార్యక్రమానికి ఇన్‌చార్జ్‌గా వెళ్లడంతో ఆయన స్థానంలో జాజిరెడ్డిగూడెం మండలంలో పల్లె దవాఖాన డాక్టర్‌గా పనిచేస్తున్న భూక్య నగేశ్ బదిలీపై మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టారు.

ఇసుక వేలం వాయిదా

నూతనకల్ : మండల పరిధిలోని తాళ్లసింగారంలో రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుక వేలం పాటను వాయిదా వేసినట్లు ఆర్‌ఐ దేవి తెలిపారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం పాడకపోవడంతో వాయిదా వేసినట్లు ఆమె తెలిపారు.

అవిలయ్య మృతి పార్టీకి తీరనిలోటు

మద్దిరాల : తాళ్లసెల్లి అవిలయ్య మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరనిలోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం అన్నారు. మండల పరిధిలోని గోరెంట్ల గ్రామానికి చెందిన కమ్యూనిస్టు నాయకుడు తాళ్లసెల్లి అవిలయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. దీంతో ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి కల్లెపల్లి భాస్కర్, గ్రామ కార్యదర్శి దీకొండ ఉపేందర్, పోలోజు సైదులు, యాదగిరి, దేవయ్య, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలను నమోదు చేయించుకోవాలి



పంటల వివరాలను నమోదు చేస్తున్న ఏఈఓ సత్యం

అర్వపల్లి : ప్రస్తుత యాసంగి సీజన్‌కు గాను సాగు చేసిన పంటల వివరాలను రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని తిమ్మాపురం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి నేరెళ్ల సత్యం కోరారు. సోమవారం మండలంలోని కోడూరులో క్షేత్రస్థాయిలో తిరుగుతూ రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుయ్యని బాబు, లింగయ్య, దేశగాని లింగస్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలు

తిరుమలగిరి (తుంగతుర్తి) : కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమాలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఐఎన్‌టీయూ ఆధ్వర్యంలో కార్మిక చట్టాలు, సంక్షేమ పథకాల అమలుపై నిర్వహిస్తున్న కార్మిక సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల చట్టాలను రద్దు చేసి హక్కులు కాలరాసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కందుకూరి కొండయ్య, వేల్పుల కరుణాకర్, వెంకటేశ్వర్లు, సోమేష్, నరేందర్, లింగయ్య, సోమయ్య, బాలాజీ, మల్లయ్య, సోమేష్, నరేందర్, లింగయ్య, సోమయ్య, బాలాజీ, మల్లయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.